నిమ్మ తోటల్లో పూత లేక..
రైతుల ఆందోళన

- సీజన్‌లో కాయల దిగుబడిపై సందిగ్ధం
- పొదలకూరులో 4 వేల హెక్టార్లలో సాగు


పూత లేని నిమ్మ తోటలు

పొదలకూరు: నిమ్మ తోటలు విస్తారంగా ఉన్న పొదలకూరు ప్రాంతంలో తేమశాతం అధికమై చెట్లకు పూత రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్టోబర్ నుంచి అల్పపీడన ప్రభావాలతో జడివానలు పట్టుకుని తోటలు దెబ్బతింటున్నాయి. మళ్లీ వర్ష సూచన ఉన్నట్టు వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తేమశాతం అధికమై చెట్లకు పూత రాలేదు. సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో తోటల్లో పూత వస్తే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కాయలు దిగుబడి పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి. పూత రావడంలో ఆలస్యం జరిగినా లేదా రాకున్నా వేసవిలో కాయల దిగుబడి తగ్గుతుంది. పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు నాలుగు వేల హెక్టార్లలో నిమ్మ సాగవుతోంది. జడివానలు, ముసురు వల్ల తోటలు చిత్తడిగా మారి ఉన్న కాయలను కోయలేక నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ధరల్లేని సమయంలో కోతలను పెద్దగా పట్టించుకోని రైతులు పూత విషయంలో మాత్రం ఆందోళన చెందుతున్నారు. మంచు వల్ల కూడా ఉన్న కాయలకు మచ్చలు ఏర్పడుతుడటంతో మరి కొంత నష్టపోవాల్సి వస్తోందంటున్నారు.

మళ్లీ ముసురు పట్టింది



ఈ ఏడాది నిమ్మతోటల్లో పూత రావడం అనుమానమే. మళ్లీ అల్పపీడన ప్రభావం వల్ల ముసురు పట్టింది. రెండురోజులు ఎండలు కాసిన వెంటనే తిరిగి ముసురు పట్టి స్వల్పంగా వర్షం కురుస్తుండటంతో తోటల్లో తేమశాతం పెరుగుతుంది. తేమశాతం పెరిగే కొద్దీ పూత పెట్టడంలో జాప్యం జరుగుతుంది. ఫలితంగా సీజన్లో కాయల దిగుబడి లేకుండాపోయి ధరలు తగ్గిన తర్వాత దిగుబడి పెరుగుతుంది.

– కె.రామిరెడ్డి, రైతు, అంకుపల్లి

ఎండలు కాస్తే మేలు

ఎండలు కాస్తే నిమ్మ తోటల రైతుల ఇబ్బందులు తొలగిపోతాయి. తేమశాతం పెరగడంతో చీడపీడలతోపాటు పూత పెట్టడం ఆసలస్యమవుతోంది. చలికాలంలో మోస్తరు ఎండలు కాస్తే భూమిలో తేమశాతం తగ్గి పూత పెట్టేందుకు అవకాశం కలుగుతుంది. మళ్లీ వర్షాలు కురిస్తే పూత రావడం ఆలస్యమై సీజన్‌లో కాయల దిగుబడి లేకుండా పోతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా నిమ్మ మార్కెట్ యార్డులో జనవరి చివరి నుంచే ధరలు పెరగడం ప్రారంభమవుతుంది. తర్వాత ఏప్రిల్, మే వరకు తగ్గుతూ, పెరుగుతున్నా రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తూనే ఉంటాయి.

కాంట్రాక్ట్ ఉద్యోగి మృతికి సంతాపం

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న శిఖరం ద్వారకా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన చిత్రపటానికి మంగళవారం ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



బుచ్చిరెడ్డిపాళెం: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా అవహేళన చేసి మాట్లాడటం సరికాదని బుచ్చిరెడ్డిపాళెం మండల బహుజన సేవా సమితి నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన చేపట్టారు. అధ్యక్షుడు పాముల రాఘవయ్య, యానాదయ్య, రమణయ్య, చిన్న కొండయ్య, వెంకటరమణయ్య, రఘునాథరావు, సత్యం, జనార్దన్, దేవసహాయం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండాల రవీంద్రారెడ్డి మంగళవారం మృతి చెందారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి రవీంద్రారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

బుచ్చిరెడ్డిపాళెంలో చిరుజల్లులు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో తేలికపాటి వర్షం మంగళవారం కురిసింది. చలిగాలులతో పలువురు ఇబ్బంది పడ్డారు. కాగా మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

27న జాబ్ మేళా

కోవూరు: పట్టణంలోని వైకేఆర్ అండ్ కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూమ్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, సీడాప్ జేడీఎం హైమావతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముత్తూట్ ఫైనాన్స్, టీసీఎల్, రిలయన్స్ రిటైల్ కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు జిరాక్స్, బయోడేటాను తీసుకురావాలని, వివరాలకు 63015 29271, 97045 10793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'గీతాంజలి'లో వర్క్‌షాపు ప్రారంభం



కోవూరు: మండలంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపును మంగళవారం ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్లుగా ఆదిత్య, పవన్‌సాయి వ్యవహరించారు. ప్రిన్సిపల్ సందీప్‌కుమార్, వివిధ విభాగాధిపతులు గాయత్రి, చక్రపాణి, నాగేంద్రకుమార్, సాయిప్రసాద్ రెడ్డి, రమేష్, పూజిత పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు

కోవూరు: క్రిస్మస్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కాంక్షించారు. ఈ మేరకు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు.

చిత్రపటం బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చిత్రపటాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు విల్సన్ దంపతులు ప్రత్యేకంగా తయారు చేయించారు. ఈ క్రమంలో దీన్ని ప్రసన్నకు వారు మంగళవారం అందజేశారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన నేతలు



నెల్లూరు(అర్బన్): సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాతను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సంఘ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో సత్కరించారు. ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, నేతలు కరుణమ్మ, కిరణ్, సతీష్, రాజేంద్రప్రసాద్, సువర్ణ, స్వర్ణలత పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): పొదలకూరు రోడ్డులోని శాంతినగర్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దుప్పట్లు, చీరలను పంపిణీ చేసి, అన్నదానాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, సాల్వేషన్ చర్చి నిర్వాహకుడు తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాల్వేషన్ చర్చి డివిజనల్ కమాండర్ రూథర్ శామ్యూల్, కోటేశ్వరరావు, జ్యోతి, విజయప్రసాద్, మేరీ గ్రేస్, చినబాబు, మనోహర్, విక్టోరియా, భరత్, మానస తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమ జయప్రదానికి పిలుపు


నేతలు, కార్యకర్తలతో ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ చార్జీల భారాన్ని ఖండిస్తూ బుచ్చిరెడ్డిపాళెంలో శుక్రవారం నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారని, అయితే ప్రస్తుతం రూ.16 వేల కోట్లకుపైగా భారాన్ని వినియోగదారులపై మోపారని ఆరోపించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వైఎస్సార్ కూడలి నుంచి సబ్‌స్టేషన్ వరకు కార్యక్రమం జరగనుందని చెప్పారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు మండలాధ్యక్షుడు సుబ్బారెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం అర్బన్, రూరల్ మండలాధ్యక్షులు మల్లికార్జున్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ

కొడవలూరు: రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై రాష్ట్ర స్థాయిలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలను విజయవాడలో సోమవారం నిర్వహించారు. వక్తృత్వం తెలుగు మీడియం విభాగంలో గండవరం హైస్కూల్ పదో తరగతి విద్యార్థి సుచిత్ర ద్వితీయ.. ఇంగ్లిష్ విభాగంలో ఏడో తరగతి విద్యార్థి సాయి హమిక తృతీయ స్థానాలను సాధించారు. వీరికి మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ క్రమంలో విద్యార్థులు, గైడ్ టీచర్ కట్టా సురేష్‌ను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఎంఈఓ వసంతకుమారి మంగళవారం అభినందించారు.

యూరియా కోసం పేర్లు నమోదు చేసుకోండి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

కొడవలూరు: యూరియా అవసరమైన అన్నదాతలు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు, మోతాదును ముందుగా నమోదు చేసుకోవాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని కొడవలూరు, గుండాలమ్మపాళెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంట నమోదు చేసుకోకపోతే రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను వెంటనే సంప్రదించాలని సూచించారు. వీఏఏలు శివజ్ఞాన, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతపై అవగాహన అవసరం


సురేంద్రబాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

కొడవలూరు: సామాజిక బాధ్యతపై విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే అవగాహన అవసరమని కొడవలూరు సీఐ సురేంద్రబాబు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తన నియమావళి, సూచనలు, సలహాలు అనే అంశంపై మండలంలోని బుచ్చి క్రాస్ రోడ్డులో గల ఓవెల్ – 18 సీబీఎస్‌ఈ హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోక్సో చట్టం తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. పాఠశాల డైరెక్టర్ వేణు, సీఈఓ ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొడవలూరు, విడవలూరు ఎస్సైలు కోటిరెడ్డి, నరేష్, ప్రిన్సిపల్ వంశీకృష్ణ, జీఎం మహదేవ్, ఈడీ బాలు, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం సునీల్, వైస్ ప్రిన్సిపల్ జనార్దన్ పాల్గొన్నారు.

మాజీ వీసీ సుదర్శనరావుకు సన్మానం



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)కు మాజీ వీసీ ఆర్.సుదర్శనరావు మంగళవారం విచ్చేశారు. ఆయన్ను ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించి వర్సిటీ అభివృద్ధి, పరిశోధనలో నూతన ఆవిష్కరణలు తదితర అంశాలపై చర్చించారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు


ముత్తుకూరు: మాట్లాడుతున్న డీటీ ప్రదీప్


మనుబోలు: అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్

ముత్తుకూరు: మండలంలోని పిడతాపోలూరులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు 21 అర్జీలు అందాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు, అడంగళ్‌లో మార్పుల కోసం అత్యధిక అర్జీలు వచ్చినట్టు డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ వెల్లడించారు. రీ సర్వే డీటీ శ్రీనివాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- **పొదలకూరు:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ బి.శివకృష్ణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టణంలో శ్మశాన స్థలాలకు దారులు సక్రమంగా లేవని స్థానికులు వినతిపత్రం అందజేశారు. వీఆర్వోలు, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.
- **మనుబోలు:** గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుబ్బయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పిడూరుపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లో సదస్సులు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న సమస్యలైతే వెంటనే పరిష్కరిస్తామన్నారు. పెద్దవి అయితే 45 రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు గ్రామాల రైతుల నుంచి 18 అర్జీలు అందినట్లు వెల్లడించారు. కార్యక్రమాల్లో సర్వేయర్లు శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, వీఆర్వో సురేందర్‌రెడ్డి, వీఆర్‌ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మస్తానయ్యకు నివాళి



కొడవలూరు: పేదల సమస్యల పరిష్కారానికి సీపీఎం నేత జడ్డా మస్తానయ్య ఎంతో కృషి చేశారని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ పేర్కొన్నారు. మస్తానయ్య మూడో వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని యల్లాయపాళెంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. నేతలు కాంతారావు, నరసయ్య, నాగమ్మ, దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కోలాహలం


ముత్తుకూరులో అలంకరించిన చర్చి


రావి ఆకుపై..


పొదలకూరులో చర్చి

ముత్తుకూరు: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

- మండలంలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ విద్యార్థులు మంగళవారం అట్టముక్కలు, వాటర్ కలర్స్‌తో కరుణామయుడి చిత్రాన్ని రూపొందించారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా తెలుగు పండిట్ సోమా పద్మారత్నం పర్యవేక్షణలో ఈ చిత్రాన్ని వేశారు.
- **పొదలకూరు:** పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజేత స్కూల్లో కార్యక్రమం నిర్వహించినట్లు కరస్పాడెంట్ జి.కామాక్షి తెలిపారు. నాగార్జున స్కూల్లో క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు. కరస్పాడెంట్ సునీతారెడ్డి, అడ్వయిజర్ సుబ్బారావు, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గా తదితరులు పాల్గొన్నారు. అమరావతి స్కూల్లో సంబరాలను నిర్వహించారు. కరస్పాడెంట్ కె.సురేష్ మాట్లాడారు.
- క్రిస్మస్ సందర్భంగా క్రీస్తు జన్మవృత్తాంతాన్ని రావి ఆకుపై మహ్మదాపురం విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య చిత్రీకరించారు.
- పట్టణంలోని పరిజాన్ జేకబ్స్ లూథరన్ చర్చిలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాస్టర్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లూథరన్ చర్చిలో కేరల్స్‌ను నిర్వహించారు. చర్చిలో క్రిస్మస్ ట్రీ ఆకర్షణగా నిలిచింది. అలాగే మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

'రెయిన్‌బో'లో

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రెయిన్‌బో స్కూల్లో ప్రీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ హాజరయ్యారు. అనంతరం చిన్నారులతో కలిసి కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు.


బుచ్చిరెడ్డిపాళెంలో..


పొదలకూరు: విజేత స్కూల్లో..


ముత్తుకూరు: నేలటూరులో..


ముత్తుకూరు: కరుణామయుడి చిత్రంతో విద్యార్థిని

ఆలయాల్లో విశేష పూజలు


విశేషాలంకరణలో ఆంజనేయస్వామి


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు జరిగాయి.

- శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.